ప్రజాశక్తి
మంగళవారం 19 డిసెంబర్ 2023
5
కర్నూలు

కర్నూలులో మాట్లాడుతున్న రామకృష్ణ

కనికరమేది..?

- అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు శూన్యం...
- సచివాలయ సిబ్బందికి బాధ్యతల అప్పగింతపై ఆగ్రహం
- అంగన్వాడీల పోరాటానికి పెరుగుతున్న మద్దతు

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపడం లేదు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదు. ఓ వైపు అంగన్వాడీలు సమ్మె చేపడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో వైపు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కేంద్రాలను నిర్వహిస్తోంది. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఆయా పార్టీలు, ప్రజాసంఘాలు మద్దతు తెలుపుతున్నాయి.

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్వాడీలకు తెలంగాణ కంటే ఎక్కువగా జీతాలు చెల్లిస్తామని పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదు. కనీసం అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కనికరం చూపకపోవడం దుర్మార్గం. అంగన్వాడీలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని, ఉద్యోగ విరమణ సమయంలో వేతనం చెల్లింపులో 50 శాతం పింఛను చెల్లించాలని, గ్రాట్యుటి ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని అంగన్వాడీలు సమ్మె బాట పట్టారు. అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీలు నిరవధిక సమ్మెను యథావిధిగా కొనసాగించారు. జిల్లాలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కేంద్రాల వద్ద అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 3,500 మంది అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో ఉన్నారు. కర్నూలు నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్, ధర్నా చౌక్ వద్ద కూడా సమ్మెను చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి కార్యకర్తలు ఓవైపు ఆందోళన చేస్తుంటే, ప్రభుత్వం మరోపక్క సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కేంద్రాలను నడిపిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలను బద్దలు కొట్టి సచివాలయ సిబ్బందితో బలవంతంగా ప్రభుత్వం పర్యవేక్షణ చేయిస్తోంది. జెసి ప్రత్యేకంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణపై ఎంపిడిఒలకు బాధ్యత అప్పగించారు. అంగన్వాడీ కేంద్రాలను యథావిధిగా తెరిచి బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సరఫరా చేయాలని జెసి నారపురెడ్డి మౌర్య ఆదేశాలు జారీ చేశారు.

అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించడం పట్ల ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమ్మెకు ఇప్పటికే ప్రతిపక్ష టిడిపి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, కార్మిక సంఘాలు సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు మద్దతు తెలిపాయి. అలాగే ఈ ఆందోళనలకు ఫ్యాప్టో, ఉపాధ్యాయ సంఘాలు కూడా మద్దతు తెలియజేశాయి.

సిఎం నిరంకుశ వైఖరి తగదు

- పి.నిర్మల, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు

సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు ఓవైపు సమ్మె చేపడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం నిరంకుశంగా అంగన్వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టి సచివాలయ సిబ్బందితో నిర్వహించడం సరైనది కాదు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ వైఖరిని విడనాడాలి. అంగన్వాడీలతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు ఈ పోరాటాన్ని విరమించేది లేదు

ఢిల్లీ రైతాంగ తరహా పోరాటం చేపడతాం

- లలిత, ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అంగన్వాడీల డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహించడం తగదు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా తెలంగాణ కంటే ఎక్కువగా వేతనం చెల్లిస్తానని అంగన్వాడీలకు హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోకపోవడం దుర్మార్గం. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి హామీలన్నింటినీ నెరవేర్చాలి.

అంగన్వాడీ సెంటర్లను

సచివాలయాలకు అప్పగించరాదు

- ఎస్‌టిబిసి కాలేజీ నుంచి భారీ ప్రదర్శన
- మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా- సిపిఐ, సిపిఎం, సిఐటియు, ఎఐటియుసి సంఘీభావం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : తాము చేస్తున్న న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న అంగన్వాడీల సమ్మె ఏడవరోజు కొనసాగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా అంగన్వాడి సెంటర్ల తాళాలను పగులగొట్టి సచివాలయ సిబ్బందికి అప్పగించడం పట్ల వారు తీవ్రంగా వ్యతిరేకించారు. సోమవారం అంగన్వాడీలు ఎస్‌టిబిసి కాలేజీ నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ ముందు ధర్నా చేశారు. ధర్మానుదేశించి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిఐటియు శ్రామిక మహిళ రాష్ట్ర నాయకులు పి.నిర్మల, ఎఐటియుసి అంగన్వాడీల రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు న్యాయమైన డిమాండ్ల కోసం ఏడు రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడమే కాకుండా అంగన్వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే గతంలో చంద్రబాబు అంగన్వాడీల పట్ల వ్యవహరించిన తీరుకు పది సంవత్సరాల వరకు అధికారానికి దూరం అయ్యారని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం కూడా అంగన్వాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అంగన్వాడి సెంటర్లను సచివాలయం ఉద్యోగులకు అప్పగించరాదని, పిల్లల తల్లిదండ్రులు, పిల్లలు అనేక చోట్ల ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే కార్పొరేషన్ కార్యాలయానికి తాళం వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ రాముడుకు వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శిఎం.విజయ రామాంజనేయులు, ఎఐటియుసి నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఎస్. మహమ్మద్ రఫీ, కె.సుధాక రప్ప, అంగన్వాడీ నాయకులు బాల దుర్గమ్మ, రుక్మిణీ, సునంద, సౌభాగ్య, వెంకటేశ్వరమ్మ, నాగమణి, మల్లేశ్వరి, ప్రవీణ పెద్ద ఎత్తున అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

గూడూరు ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి

గూడూరు : ఏడోరోజు అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి కుమార్ సంఘీభావం తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ లను మాత్రమే అమలు చేయాలని కోరు తున్నామని అంగన్‌వాడీ, సిఐటియు నా యకులుఅన్నారు. సిఐటియు నాయకులు జె.మోహన, అంగన్వాడి నాయకులు రత్నమ్మ, అనంతమ్మ, ఇందుమతి, మద్దమ్మ, ఫాతిమా, హైమా వతి,గూడూరు, కోడుమూరు, సిబెళగల్ మండ లాల్లోని అంగన్వాడి కార్మికులు పాల్గొన్నారు. ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు.

అంగన్వాడీల భిక్షాటన..

పత్తికొండ.: పత్తికొండలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. సిఐటియు మండల కార్యదర్శి గోపాల్ ,సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి, ఆస్పరి మండల కార్యదర్శి హనుమంతు, తుగ్గలి మండల కార్యదర్శి శ్రీ రాములు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ సంఘం నాయకులు శోభ, పద్మ, కాంతమ్మ, రామలక్ష్మి, లక్ష్మి పాల్గొన్నారు.

గూడూరులో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్

ఆశాల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ
- కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్ల ధర్నా

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వైద్య, ఆరోగ్య శాఖలో పని చేసే ఆశావర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా చేపట్టారు. జిల్లా నాయకులు శివలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సచివాలయ పరిధిలో కాకుండా గ్రామస్థాయిలోనే వీరి సేవలను వినియోగించుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నా శిబిరానికి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామ గిడ్డయ్య, నోడల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ వచ్చి యూనియన్ ప్రతినిధుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రామగిడ్డయ్య హామీ ఇచ్చారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వరి భాయి, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు శాంతకుమారి, దస్తగిరమ్మ, సౌమ్య, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఆరోగ్యశ్రీ చికిత్సకు రూ .25 లక్షలకు పెంపు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పేదవాడికి ఆరోగ్యశ్రీని మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. సోమవారం కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి నుండి ప్రారంభించారు. కలెక్టరేట్ కార్యాలయంలో నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సుధాకర్, జిల్లా ఎస్‌పి జి.కష్ణకాంత్‌లు హాజ రయ్యారు. తదనంతరం అర్హులైన లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ రామగిడ్డయ్య, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు..

కార్డుల పంపిణీలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

స్పందన అర్జీలు పరిష్కరించాలి

స్పందన అర్జీలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జగనన్నకు చెబుదాం-స్పందన'లో ప్రజల నుంచి వచ్చిన వినతులను జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. స్వీకరించిన అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్ మెంట్ అందజేసి కార్యాలయాల వద్దకు పిలిపించి ఎండార్స్‌మెంట్ అందజేసేలా చర్యలు తీసు కోవాలన్నారు. దీని వల్ల అర్జీదారులలో సంతృప్తి స్థాయి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అర్జీ దారుడు సంతప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీ లను తప్పనిసరిగా పరిష్కరించా లన్నారు. పెండింగ్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూసు కోవాలన్నారు. డిఆర్ఒ కె.మధు సూదన్ రావు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు నాగప్రసన్న లక్ష్మి, రమ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం ఎపిఎస్‌పిడిసిఎల్ కార్యాలయం ముందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు పి.నాగరాజు, సిఐటియు జిల్లా నాయకులు కె.ప్రభాకర్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కనీసం 2022 పిఆర్‌సి ప్రకారం బేసిక్ వేతనాలు చెల్లించాలని ,సమాన పనికి సమాన వేతనం ఇచ్చి అందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు వాచ్మెన్‌గా పనిచేస్తున్న సిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించిన వారికి పాత ఆపరేటర్స్‌తో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. బిల్ కలెక్షన్ ఏజెంట్లకు, ఎస్‌పిఎం కార్మికులకు విద్యుత్ స్టోర్ హమాలీలకు పీస్ రేటు రద్దుచేసి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌కోలో సిబిడి కార్మికులకు ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం, కోలుకునేదాకా ప్రత్యేక సెలవులు ఇచ్చి వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. మహిళా ఉద్యోగులకు ఇతర శాఖలోని కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా ఏడాది ప్రత్యేక సెలవులు అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులందరూ పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తూ ఉన్నందున సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంస్థ పరిరక్షణ కోసం పనిచేస్తున్న వారి హక్కులను కాపాడాలని వెంటనే కాంటాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. డిఇ ఓబులేసుకు వినతి పత్రంఇచ్చారు. ఆదోని డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.భీమేష్, ప్రవీణ్ కుమార్, స్టోర్‌రూంహమాలీ యూనియన్ నాయకులు మోహన్,చలపతి,జావీద్,నాగరాజు, మద్దిలేటి కాంటాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలి రైల్వే స్టేషన్ పెరవలి క్రాస్ రోడ్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మామిళ్ళకుంటకు చెందిన వెంకటేష్(35) అక్కడికక్కడే మృతి చెందారు. మామల్లకుంట గ్రామానికి చెందిన ఆయన బంధువుల గృహప్రవేశానికి గుంతకల్‌కు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రైల్వే క్రాస్ రోడ్ వద్ద ఆదోని వైపు వెళుతున్న లారీ ఢీకొంది, మృతి చెందిన వెంకటేష్‌కు భార్య ఈరమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నారు. వైసిపి వింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

జిల్లా వైఎస్ఆర్ యువజన విభాగ జాయింట్ సెక్రెటరీగా అశోక్ కుమార్ రెడ్డి

వెల్దుర్తి : కర్నూలు జిల్లా వైఎస్ఆర్ యువజన విభాగ కమిటీ జాయింట్ సెక్రెటరీగా వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వెల్దుర్తి మండలం బోయినపల్లి నార్సింగ్ అశోక్ కుమార్ రెడ్డిని నియమించారు. తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డికి పత్తికొండ నియోజకవర్గం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ అరబిక్ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఇస్లామియా అరబిక్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అరబిక్ దినోత్సవాన్ని సోమ వారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కర్నూలు ఎమ్మెల్యే అబ్దుల్ హాఫీజ్ ఖాన్, రాయలసీమ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఫజుల్ రెహ్మాన్, డాక్టర్ ఫాజ్లులా షరీఫ్, ఛైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఉస్మానియా యూనివర్సిటీ కీనోట్స్ స్పీకర్‌గా పాల్గొన్నారు. ఇస్లామియా అరబిక్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అమీర్ అహ్మద్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ ఎల్లప్పుడూ అరబిక్ భాషా సేవలకు సిద్ధంగా వుంటా నన్నారు. వీలైనంత త్వరగా రాయలసీమ యూనివర్సిటీలో లేదా అబ్దుల్ హక్ యూనివర్సిటీలో అరబిక్‌విభాగాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రొఫెసర్ గా ఎన్నికైన ఖాజా మొహిద్దీన్‌కు నజ్మతుల్లా షరీఫ్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సమిఉద్దీన్, ప్రొఫెసర్ పిఎఫ్.రెహమాన్, ఖాజి థౌసిఫ్, అబ్దుల్లా హాఫిసాబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై వైసిపి రాష్ట్ర నాయకత్వం జోక్యం అవసరం : పిపిఎస్ఎస్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

విధానపరంగా విభేదాలు ఉన్నప్పటికీ అధికార పార్టీ ప్రజాసంఘాల మధ్య ఉన్న మంచి వాతావరణాన్ని చెడగొట్టేందుకు కొందరు వైసిపి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం(పిపిఎస్ఎస్) రాష్ట్ర కమిటీ సభ్యులు ఇ. పుల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర సంఘాల బ్యానర్లు తోరణాలు తొలగించడం వల్ల అధికార పార్టీకే చెడ్డ పేరు వస్తుందని వైసిపి రాష్ట్రనాయకత్వం జోక్యం చేసుకొని నగరంలో అధికార పార్టీలకు ప్రజాసంఘాల మధ్య ఉన్న మంచి వాతావరణం చెడగొట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఐకెఎస్‌లో పనిచేస్తూ మాజీ ప్రజా ప్రతినిధులు 3 రోజులపాటు కర్నూల్లో జరిగిన రైతు సంఘం జాతీయ సభల్లో పాల్గొన్నారు. అఖిల భారత కిసాన్‌సభ నాయకులు, ఏడు సార్లు ఎంపీ గా ఉన్న మాజీ ఎంపీ అన్నన్ మొల్లతో పాటు అఖిలభారత రైతు సంఘం నాయకుల స్వాగత తోరణాలు, బ్యానర్లను అధికార పార్టీ బస్సు యాత్ర వస్తుందని నెపంతో నగరంలో ప్రధాన కూడళ్లలో మొదటి రోజు సాయంత్రమే కొందరు వైసిపి నాయకులు తొలగించి వారి తోరణాలు కట్టుకున్నారు. మూడు రోజులు నగరంలో ఎఐకెఎస్ సమావేశాలు విజయవం అయ్యేందుకు నగర మేయర్ బి వై.రామయ్యసహా అనేకమంది అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, వ్యాపార వాణిజ్య విద్య, వైద్య,రంగాల ప్రముఖులు పాల్గొని అనేక రూపాల్లో సహకారం అందించారన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం చెల్లించాలి

-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతంలో రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి ఎండి. అంజిబాబు మాట్లాడుతూ 17 సంవత్సరాలుగా ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. వారికి కనీస వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరి చేయించుకుంటుందన్నారు. మ్యాన్ డేస్ టార్గెట్ విధానాన్ని రద్దుచేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల మున్సిపాలిటీలోకి విలీనమైన గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరారు. వీరందరికీ ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల సాయం చేయడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నిటిని ప్రభుత్వం పరిష్కరించకపోతే చలో విజయవాడ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు నాయక్, వీరేష్ గౌడ్, జిల్లా నాయకుడు వీరేష్, బొజ్జప్ప, బాలు, గిడ్డయ్య, మధు, రమణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సీటు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు

కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు నోటీసును అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలి

జిల్లా కలెక్టర్‌కు యుటిఎఫ్ ఆధ్వర్యంలో నోటీసు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్ నవీన్ పాటిలు డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటో తారీకు వేతనాలు కూడా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌ను యుటిఎఫ్ ప్రతినిధి బృందం డిమాండ్ నోటీస్ అందజేసింది. సురేష్ కుమార్, రవికుమార్, నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శి తిమ్మనలు ఉన్నారు. సురేష్ కుమార్ ,రవి కుమార్ నవీన్ పాటీలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు సంబంధించిన వేతనాల చెల్లింపు ఇతర ఆర్థిక బకాయిల విడుదలపై దశలవారీగా ఉద్యమాలను చేపట్టనున్నామన్నారు. మంత్రులు ఎమ్మెల్యేల దృష్టికి కూడా తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈనెల 27వ తేదీన మండల తాలూకా కేంద్రాల్లో ఆరు గంటల పాటు ధర్నా నిర్వహించనున్నామన్నారు. జనవరి3న జిల్లా కేంద్రంలో 12 గంటల పాటు ధర్నా నిర్వహించనున్నామన్నారు. జనవరి 7న రాష్ట్ర కేంద్రంలో 36 గంటల ధర్నా కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.

చెన్నకేశవరెడ్డి సేవలు చిరస్మరణీయం

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్



చెన్నకేశరెడ్డి మౌతికకాయం యుటిఎఫ్ నివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో సైన్సు ఉద్యమంలో చెన్నకేశవరెడ్డి చేసిన సేవలు ఆదర్శనీయమని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్ పేర్కొన్నారు. యుటిఎఫ్ ఉద్యమ నేత చెన్నకేశవరెడ్డి గత ఆదివారం అనారోగ్యంతో మతి చెందారు. సోమవారం కర్నూలు నగరంలోని చెన్నకేశవరెడ్డి స్వగృహంలో ఆయన భౌతికకాయానికి యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జెవివి జిల్లా అధ్యక్షుడు సుధీర్ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జెవివి జండాలను కప్పి భౌతికకాయానికి అంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో యుటిఎఫ్ ఉద్యమ నిర్మాణంలో ఎంతో క్రియాశీలకంగా చెన్నకేశవరెడ్డి పని చేశారన్నారు. అక్షరాస్యత ఉద్యమం , సారా వ్యతిరేక ఉద్యమాల్లో ఎంతో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. ఉపాధ్యాయుడిగా రిటైర్డ్ అయిన తర్వాత సైన్స్ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని అన్నారు.

ప్రజల సంక్షేమమే జగన్మోహన్ రెడ్డి లక్ష్యం

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. సోమవారం కౌతాళం సచివాలయం-2 పరిధిలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన సతీమణి జయమ్మ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా, లేదా, ఇంకా ఎవరైనా అర్హులై ఉంటే వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వివరించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, వికలాంగులకు సదరన్ క్యాంపు ఏర్పాటు చేసి పింఛన్లు అందించాలని, రోడ్లు వేయాలని ప్రజలు వారి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపైన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చారని తెలిపారు. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలనను మళ్లీ కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజల కోసం ఎవరైతే కష్టపడి పనిచేస్తున్నారో, రాబోయే ఎన్నికల్లో వారికే పట్టం కట్టాలని, జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, సర్పంచి పాల్ దినకరన్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, ఉప సర్పంచి తిక్కయ్య, వైసిపి నాయకులు అవతారం, చౌదరి బసవరాజు, సుబ్బరాజు, రాఘవేంద్ర రెడ్డి, వడ్డే రాముడు, భీమేష్, వెంకటరామరాజు, అబ్దుల్ సమద్, ఎంపిడిఒ సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసమే వైసిపి

- మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

సమస్యలు తెలుసుకుంటున్న జయ మనోజ్ రెడ్డి

పేదల కష్టాల్లో నుంచి పుట్టిన వైసిపి ప్రజా శ్రేయస్సు కోసమే పని చేస్తోందని మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ జయ మనోజ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆదోనిలోని 7వ వార్డు ఖునీమొహల్లాలో వార్డు కౌన్సిలర్ ఉస్మాన్ బాషతో కలిసి 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా జయమనోజ్ రెడ్డి మాట్లాడారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ప్రజలకిచ్చిన హామీ మేరకు 98 శాతం సంక్షేమ పథకాలు అమలు చేసి పార్టీలకతీతంగా పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత టిడిపి ప్రభుత్వాలు చేయని అభివృద్ధి కేవలం నాలుగున్నర సంవత్సరాల్లోనే చేసి చూపించారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డిని 2024లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి గెలిపించుకుంటే ఆదోని మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. వైసిపి పట్టణ అధ్యక్షులు బి.దేవా, వైస్ ఛైర్మన్‌లు నరసింహులు, ఎంఎంజి.గౌస్, నాయకులు లాల్ బాష, అశోక్, యాసిన్, ఖాదర్, సన్నీ, శ్రీనివాస్ రెడ్డి, తాయన్న, ఈశ్వర్, వీరేష్, జావేద్, మల్లికార్జున, జహీర్, ముల్లా రఫీక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఉపాధ్యాయుడు

- అభినందించిన హెచ్‌ఎం, పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఈనెల 6న కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఉపాధ్యాయ విభాగంలో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు విజయ్ కుమార్ ప్రతిభ చూపి జిల్లాలో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికయ్యారు. సోమవారం విజయ్‌కుమార్‌ను ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విజయ్ కుమార్ తయారు చేసిన బోధనోపకరణాలు సైన్స్ అంశాలను విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కూడా ఆయన విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. గుమ్మల బాబు, జె.ఉస్మాన్, ఈరన్న, రంగస్వామి, అబ్దుల్ సలీం, రాజేష్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

విజయకుమార్‌ను అభినందిస్తున్న సిబ్బంది

మాట తప్పిన ప్రభుత్వం

- చెవిలో పూలు పెట్టుకుని అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-ఆలూరు

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం మాట తప్పిందని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలూకా కార్యదర్శి జయశ్రీ, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి విమర్శించారు. సమస్యలను పరిష్కరించాలని సోమవారం 6వ రోజు సమ్మె చేపట్టారు. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణలో కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామని, ఉద్యోగ భద్రత, అర్హులకు ప్రమోషన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛను సౌకర్యం కల్పిస్తానని అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చి మరిచారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు మినీ అంగన్వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్వాడీలో చేర్చాలని, వర్కర్లకు, హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని కోరారు. అంగన్వాడీల సమ్మెకు వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు, జిల్లా అధ్యక్షులు అర్జున్, విఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు సురేంద్ర, లక్ష్మణ్, గోవిందు, తిమ్మప్ప, ఎస్‌టియు నాయకులు బి.నాగరాజు, అశ్విని కుమార్, రమేష్, సూర్యనారాయణ మద్దతు తెలిపారు. సిఐటియు తాలూకా నాయకులు కృష్ణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లీలావతమ్మ, సరోజమ్మ, బాలరంగమ్మ, లక్ష్మీ, సరస్వతి, సుజాత, ప్రభావతి, పుష్పవతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు. **ఆదోని**లోని అంబేద్కర్ విగ్రహం ముందు వరలక్ష్మి, జానకి అధ్యక్షతన అంగన్వాడీల సమ్మె ఏడో రోజుకు చేరుకుంది. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, ఎఐటియుసి పట్టణ నాయకులు టి.వీరేష్, అంగన్వాడీ వర్కర్లు పద్మ, రేణుక, సరోజ, వీరమ్మ, మీనా కుమారి, రిజ్వానా, అంగన్వాడీ యూనియన్ (ఎఐటియుసి) నాయకులు జానకి, శారద, ఈరమ్మ పాల్గొన్నారు. **మంత్రాలయం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉన్న ప్రాజెక్టు కార్యాలయం నుంచి పాత ఊరులోని ఎస్-ఎస్ ట్యాంకు వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కార్యదర్శి హెచ్.జయరాజు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు విశాలాక్షి ఆధ్వర్యంలో ట్యాంకు ఎక్కి నిరసన చేపట్టారు. అంగన్వాడీలు ఉమామహేశ్వరి, భీమేశ్వరి, లావణ్య, ఫాతిమా, ద్రాక్షాయని పాల్గొన్నారు. **కోసిగి**లో బస్టాండ్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, అంగన్వాడీ యూనియన్ నాయకులు హెబ్సిబా రాణి, లుసమ్మ మాట్లాడారు. సమ్మెకు టిడిపి మండల కన్వీనర్ జ్ఞానేష్ మద్దతు తెలిపారు. టిడిపి నాయకులు వక్రాని వెంకటేశులు, నాడిగేని అయ్యన్న, భరద్వాజ శెట్టి, వీరారెడ్డి, మహాదేవ, రాజు, ఉమర్ సాబ్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 7వ రోజుకు చేరింది. ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి, ఎంఇఒకు సమస్యలను వివరించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ధర్నా చేపట్టారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మల్లయ్య, మండల కార్యదర్శి మేలిగిరి ఈరన్న, అంగన్వాడీ నాయకురాలు విజయలక్ష్మి, రోజామేరీ, కాసింబీ, పుష్ప, దీప్తి, చాముండి, విజయలక్ష్మి, రాధా పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** ప్రాజెక్టు పరిధిలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు జెఎసి ఆధ్వర్యంలో 7వ రోజు సమ్మె కొనసాగింది. అంగన్వాడీలు ర్యాలీగా వెళ్లి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, పట్టణ ప్రాజెక్టు కార్యదర్శులు ఎస్.నాగలక్ష్మి, నాగ శిరోమణి, బసమ్మ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ఎస్.రాజు, అంగన్వాడీ నాయకులు శైలజ, నాగలక్ష్మి, తులసి, మేరీ, పద్మలత, గ్రేసమ్మ, నాగలక్ష్మి, నిర్మల, గౌసియా, సునీత, బండ లత, సుమిత్ర, అత్తర్ బాను, జయమ్మ, పార్వతి, సునీత, రాగమ్మ, శంషాద్ భాను పాల్గొన్నారు.

ఆలూరులో చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మంత్రాలయంలో నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

ఆదోనిలో నిరసన చేపడుతున్న అంగన్వాడీలు

కోసిగిలో మద్దతు తెలుపుతున్న టిడిపి నాయకులు

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

- ఇఒఆర్‌డి బాలన్న

- డ్రెయినేజీతో కూడిన కాలువల నిర్మాణానికి కొలతలు

ప్రజాశక్తి - చిప్పగిరి

గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని ఇఒఆర్‌డి బాలన్న తెలిపారు. సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ప్రధాన రహదారి అయిన రాంపురమయ్య వీధిలో సిసి రోడ్డు నిర్మాణాలను పరిశీలించారు. అలాగే గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో డ్రెయినేజీ కాలువలు నిర్మించడానికి అధికారుల చేత కొలతలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిసి రోడ్డు ఉన్నా, డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో కలుషితమైన మురుగునీరు రోడ్డుపై నిల్వ ఉంటోందని తెలిపారు. దోమల వ్యాప్తి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వీటన్నింటినీ గమనించి వెంటనే డ్రెయినేజీ కాలువలు నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. పనులు కూడా వారం రోజుల్లోపు మొదలు పెడతామని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మి, గ్రామ సేవకులు హుస్సేని పాల్గొన్నారు.

కొలతలను పరిశీలిస్తున్న ఇఒఆర్‌డి బాలన్న

వాల్మీకులకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు కేటాయించాలి

- వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు

ప్రజాశక్తి-ఆలూరు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ వాల్మీకులకు అత్యధిక స్థానాల్లో ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించాలని వాల్మీకి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌లో వాల్మీకి సంఘాల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 'మనదే జెండా, మనవే ఓట్లు, మనదే రాజ్యాధికారం' అనే నినాదంతో 100 స్థానాల్లో వాల్మీకి నాయకులు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మొలగవల్లి రామాంజనేయులు, టిడిపి మీడియా అధికార ప్రతినిధి సురేంద్ర, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్లార్తి అర్జున్, వాల్మీకి సీనియర్ నాయకులు కురువళ్లి శివన్న, జనసేన ఛత్రపతి, పెద్దహోతూరు ఎంపిటిసి వాల్మీకి రమేష్, అరికెర అంజినయ్య, అంజి, బోయపాటి సురేంద్ర పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న వాల్మీకి నాయకులు

రైతులను ఆదుకోవడంలో వైసిపి విఫలం

- వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గద్దె దించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

జిల్లాలో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ విమర్శించారు. సోమవారం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 10వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ముందుగా పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్, షరాఫ్ బజార్, సోమేశ్వర సర్కిల్, ట్యాంకు బండ్, కూరగాయల మార్కెట్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్కిల్‌లో రైతు సంఘం జిల్లా నాయకులు పంపన గౌడ్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా రామకృష్ణ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో దివాలాకోరు ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. కరువు, కాటకాలతో వేలాది ఎకరాలు నష్టపోయి రైతులు కష్టాలను మూటగట్టుకుని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కనీసం స్పందించకపోవడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ కరువు సహాయక చర్యలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అప్రజాస్వామిక విధానాలను అవలంభిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌ను కనీసం అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా కలవలేని పరిస్థితి ఉందని చెప్పారు. ప్రజాప్రతినిధులనే కలవని ముఖ్యమంత్రి, ప్రజలకు ఏం సేవ చేస్తారని ప్రశ్నించారు. రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.రామచంద్రయ్య, కెవివి.ప్రసాద్ మాట్లాడుతూ... జిల్లాలో కరువు మండలాలను ప్రకటించినప్పటికీ ఇంతవరకు కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కేంద్ర కరువు పరిశీలన బృందం పర్యటించి రోజులు గడుస్తున్నా ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ఇప్పటివరకు వెల్లడించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి రైతుల బాధలను పట్టించుకుని, కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. రైతుసంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీరెడ్డి, జగన్నాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సహాయ కార్యదర్శి మునెప్ప, పట్టణ కార్యదర్శి రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు నబి రసూల్, రామకృష్ణారెడ్డి, అజయ్ బాబు, శ్రీరాములు, కారుమంచి, విరుపాక్షి, రాజసాహెబ్ పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న రామకృష్ణ

'జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి'

ఆదోని : జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని జాప్ జిల్లా అధ్యక్షులు నరేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, జిల్లా సహాయ కార్యదర్శి మందుల వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్ నిబంధన లేకుండా ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. గ్రామాల నుంచి వచ్చే జర్నలిస్టులకు కూర్చోడానికి వీలుగా ఆదోనిలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రెస్ క్లబ్, ఇంటి స్థలాలకు అనువైన ప్రదేశం చూసి ఇళ్ల స్థలాలను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జాప్ నాయకులు చంద్ర శేఖర్, రంగన్న, గౌస్, రామ్ గోపాల్ రెడ్డి, ఉదయ్ కుమార్, ఈరన్న, శ్రీకాంత్, రాజు, శాంత మూర్తి, రమేష్, రాజశేఖర్, అల్లప్ప పాల్గొన్నారు.

'వన్య ప్రాణులను సంరక్షించాలి'

- ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఆదోని

వన్యప్రాణులను సంరక్షించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నాయకులు కోరారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనలో సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సభ్యులు ఆర్.దేవి ప్రసాద్, జైభీమ్ జాతీయ నాయ కులు జైభీమ్ సాయిరాం మాట్లాడారు. ఎమ్మిగనూరు, ఆదోని మధ్యలో కోటేకల్ ఫారెస్టు ఏరియాలో చిన్న పిచ్చుకలు, పక్షు లు, వన్యప్రాణులు ముళ్లపొదల్లో నివాసం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల న్నారు. వన్య ప్రాణులను వేటాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీరేష్, సృజన్, సూర్య పాల్గొన్నారు

లబ్ధిదారులు తృప్తి చెందేలా చూడాలి

అర్జీలను లబ్ధిదారులు తృప్తి చెందేలా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్పందనలో డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల లబ్ధిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. బాధితులు అడిగిన సమస్యకు అర్థమయ్యే విధంగా ఎండార్స్ మెంట్ ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరిస్తే బియాండ్ ఎస్‌ఎల్‌ఎ లో ఉండవని తెలిపారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్య పరిష్కార మవుతుందా లేదా అని అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. పరిపాలన అధికారి గోవింద్ సింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, డిఎల్‌డిఒ నాగేశ్వరరావు, ఆర్‌టిసి డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కె.లక్ష్మీనారాయణ, ఉప తహశీల్దార్లు వలీ బాష, కౌసర్ బాను పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- జనసేన ఇన్‌ఛార్జీ రేఖాగౌడ్

- హెచ్.కైరవాడి హంద్రీ నదిలో అక్రమ తవ్వకాలు చేపట్టిన ప్రదేశాల సందర్శన

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రేఖాగౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని హెచ్.కైరవాడి హంద్రీ పరివాహక ప్రాంతంలో అడ్డగోలుగా భూములను తవ్వి ఇసుక రవాణా చేపడుతున్న ప్రాంతాన్ని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇసుక అక్రమ తవ్వకాలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని, నియంత్రించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. పేదల ఇంటి నిర్మాణ అవసరాలకు రూ.వేలు ఖర్చు పెట్టినా సమయానికి ఇసుక అందడం లేదని తెలిపారు. కొంతమంది నాయకులకు మాత్రం స్టాక్ పాయింట్లు పెట్టుకునేంత దొరకడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. హంద్రీ పరిసర ప్రాంతాలైనా గంజహల్లి, హెచ్.కైరవాడి, అగ్రహారం గ్రామాల్లో రాత్రి వేళల్లో అడ్డగోలుగా ఇసుకను రవాణా చేస్తున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. హంద్రీ ప్రాంతంలో ఇసుక రవాణా చేసేందుకు ప్రభుత్వ అనుమతి ప్రకారం రీచ్ ఏర్పాటు చేయలేదని, కానీ కొంతమంది దళారులకు మాత్రం రీచ్ అడ్డాగా మారిందని తెలిపారు. అధికారులు చొరవ తీసుకుని ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జనసేన పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జనసేన నాయకులు గానిగ బాషా, కరణం రవి, ఎల్లప్ప, ఖాసీం సాహెబ్, మాలిక్, దూద్ పీరా, నరసింహులు, భాస్కర్, మునిస్వామి, సుభాన్, వినోద్, మాబాష, మల్లి, వెంకటేష్, మునాఫ్, ఆదామ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

హంద్రీలో ఇసుక అక్రమ తవ్వకాల వద్ద బైఠాయించిన జనసేన నాయకులు

సింహ గర్జనను జయప్రదం చేయండి

- మాదాసి, మాదారి కురువ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారుడు బత్తిని లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - ఆదోని

సమావేశంలో మాట్లాడుతున్న బత్తిని లక్ష్మీనారాయణ

ఈనెల 24న ఆలూరులో జరిగే కురువల సింహ గర్జనను జయప్రదం చేయాలని మాదాసి, మాదారి కురువ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు బత్తిని లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం పట్టణంలోని ఎన్‌డిబిఎల్ ఫ్యాక్టరీలో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి నారాయణ, జడ్‌పి మాజీ ఛైర్మన్ బత్తిని వెంకటరాముడు, కురువ సంఘం జిల్లా అధ్యక్షులు దేవేంద్రప్ప, ఖాదీ బండార్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ రఘురామ్ మాట్లాడారు. అత్యధిక జనాభా కలిగిన కర్నూలు జిల్లాలో వచ్చే ఎన్నికల్లో ఒక పార్లమెంటు, రెండు ఎమ్మెల్యే స్థానాలు కురువలకు కేటాయించాలని కోరారు. రాజకీయంగా ప్రాధాన్యత కల్పించే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి జాతీయ కార్యదర్శి రామకృష్ణ, అట్టేకల్ బాబు, సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సోమలింగం, సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు, కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిలేటి, సర్పంచుల సంఘం జిల్లా మాజీ కార్యదర్శి బత్తిని లోకనాథ్, బ్రహ్మయ్య, ఎమ్‌డి.హళ్లి సర్పంచి సుధాకర్, వందవాగిలి సర్పంచి శేషన్న, దొడ్డనగేరి శివప్ప, కుంటానహాళ్ సర్పంచి శివరాం, కుంటానహాళ్ ఎంపిటిసి సిద్ధప్ప, కురువ సంఘం మండల అధ్యక్షులు చాగి మల్లికార్జున రెడ్డి, కారం శంకర్, నాయకులు సంతోష్, మనేకుర్తి నాగరాజు, కల్లుబావి నాగరాజు, నాగరాజు, మాజీ సర్పంచి సులేఖరి చిన్న ఈరన్న, వందవాగిలి యంకోబా, కుంటానహాళ్ నరసింహులు, మల్లికార్జున, యంకన్నపేట మల్లికార్జున, మదిరే ఎల్లప్ప, చిరుతపల్లి నరసింహులు పాల్గొన్నారు.

రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డిప్ సంస్థల ఆధ్వర్యంలో

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె, చిన్నకొత్తిలి, పెద్దకొత్తిలి గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడారు. భారతదేశం వ్యవసాయంతో పాటు పశు పోషణలో కూడా అభివృద్ధి సాధించాలని తెలిపారు. జీవనోపాధులు పెంచుకోవాలని కోరారు. ప్రస్తుతం బర్రెలకు, మేకలకు, ఆవులకు రోగ నిరోధక శక్తి తగ్గి, పాల ఉత్పత్తి తగ్గుతోందని, సీజనల్ వ్యాధులు వస్తాయని చెప్పారు. పశు యజమానులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరిస్థితిలను దృష్టిలో ఉంచుకుని రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థ అవగాహన, శిక్షణలు ఏర్పాటు చేసి మెళకువలు, జాగ్రత్తలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రోగ నిరోధక శక్తి, పాల ఉత్పత్తిని పెంచాలని ఉచితంగా దాణా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆర్డిప్ సంస్థ ఎక్స్‌టేషన్ వర్కర్ ఉస్సేని మాట్లాడుతూ... రైతులకు పోషక విలువలతో కూడిన దాణా ఉచితంగా అందించినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నెంబర్ 18004198800కు సంప్రదించాలని కోరారు. సర్పంచి బోయ లక్ష్మి తిమ్మప్ప, హారతి, చంద్రశేఖర్, ఎపిసిఎన్ఎఫ్ శ్రీనివాసులు, పెద్ద రామాంజనేయులు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రైతులకు దాణా అందజేస్తున్న సభ్యులు

హనుమద్వాహనంపై చెన్నకేశవ స్వామి

ప్రజాశక్తి-ఆలూరు

మండలంలోని మొలగవల్లి గ్రామంలో వెలసిన శ్రీచెన్నకేశవ స్వామి రథోత్సవం ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం హనుమద్వాహనం, అశ్వ వాహనం, గరుడ వాహనాలపై చెన్నకేశవ స్వామి, లక్ష్మీ, భూదేవి సమేతంగా గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి వారి విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తూ నందికోలు ఆడుతూ భక్తులు రెండు గ్రూపులుగా విడిపోయి సద్ద, జొన్నపిండితో చేసిన కుడుములు, ఆట మహోత్సవాన్ని ఊరి వాకిలి దగ్గర ఒకరిపైఒకరు కుడుములు విసురుకొని ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. రాత్రి జరిగిన చింతామణి పౌరాణిక నాటకం ఆకట్టుకుంది. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలూరు, హాలహర్వి ఎస్‌ఐలు ఓబులేసు, నాగేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్పంచి మోహన్ రాజ్, ఉప సర్పంచి ఎంపి.రంగన్న, టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, ఎంపిటిసి బంగారు సునంద పటేల్, శివస్వామి, టిడిపి సీనియర్ నాయకులు మోక మల్లయ్య, శీనప్ప, ఆంజనేయ్య, ఆలయ కమిటీ ఛైర్మన్ కృష్ణప్ప, హనుమప్ప, హరే రాం తిక్కన్న పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబురావు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- డిసిసి అధ్యక్షులు బాబురావు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని డిసిసి అధ్యక్షులు బాబురావు తెలిపారు. సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనూ, దేశంలోనూ అత్యధిక మెజార్టీతో గెలుపొంది కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టే సమయం దగ్గర పడిందన్నారు. మోడీ ప్రభుత్వానికి కీలుబొమ్మగా రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి నిత్యం ప్రజా సమస్యలు తెలుసుకునే దిశలో కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బోయ నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు దిలీప్ ధోకా, మైనార్టీ సంఘం జిల్లా జిల్లా కన్వీనర్ ఎమ్ఎమ్‌డి.నూర్, సాయినాథ్, లక్ష్మీనారాయణ, దేవిశెట్టి వీరేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

దాడులతో టిడిపి గెలుపును ఆపలేరు

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి

ప్రజాశక్తి - నందవరం

టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఎన్ని దాడులు చేసినా టిడిపి గెలుపును ఎవరూ ఆపలేరని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి తెలిపారు. ఇటీవల వైసిపి నాయకుల దాడిలో గాయపడి ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి గోనెగండ్ల మైనార్టీ నాయకులు బేతాల బడేసాబ్‌ను సోమవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అభివృద్ధి మరిచి, అరాచకాలు సృష్టిస్తోందని, టిడిపి నాయకులను, కార్యకర్తలను భయపెట్టి మరోసారి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. దాడులు పెరిగే కొద్దీ టిడిపి మరింత బలోపేతం అవుతోందని తెలిపారు. భౌతిక దాడులు రాజకీయాల్లో మంచిది కాదని, అలాంటి దాడులను టిడిపి వ్యతిరేకిస్తూ ప్రజలకు అండగా ఉంటామని చెప్పారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. రాష్ట్రాన్ని వైసిపి బారి నుంచి కాపాడుకోవాలని తెలిపారు. టిడిపి నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, బొట్టు స్వామి పాల్గొన్నారు.

గాయపడిన బడేసాబ్‌ను పరామర్శిస్తున్న మాధవరావు దేశాయి

నంద్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు నిరసన ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఉద్యోగులకు, అంగన్‌వాడీలకు మధ్య ప్రభుత్వం చిచ్చు...

- తాళాలు పగలగొట్టడానికి అధికారులు యత్నం
- రుద్రవరంలో అడ్డుకున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు
- అండగా నిలిచిన లబ్ధిదారులు, సిఐటియు, రైతు సంఘం నాయకులు
- ప్యాపిలి, బనగానపల్లె, కొలిమిగుండ్ల, చాగలమర్రిలో కేంద్రాలు స్వాధీనం

రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం తాళం పగలగొడుతున్న రెవెన్యూ సిబ్బందిని అడ్డుకుంటున్న అంగన్వాడి కార్యకర్తలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం చిన్న కంబలూరు గ్రామంలోని అంగన్వాడి సెంటర్ తాళాలు పగలగొట్టేందుకు విఆర్ఒ, సచివాలయ సిబ్బంది సోమవారం యత్నించారు. విషయం తెలుసు కున్న అంగన్వాడి కార్యకర్తలు పద్మావతి, షహీన్, మరియమ్మ, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి నాగలక్ష్మి అక్కడికి చేరుకుని అధికారులను మిగతా 6వ పేజీలో...

అంగన్‌వాడీలకు, ఉద్యోగులకు మధ్య రాష్ట్ర ప్రభుత్వం చిచ్చుపెడుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి సచివాలయ సిబ్బందికి అప్పగించడం పట్ల అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం మండలం చిన్నకంబలూరులో అంగన్‌వాడీ కేంద్రం తాళాలను అధికారులు పగలగొట్టేందుకు యత్నించగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అడ్డుకున్నారు. అంగన్‌వాడీలకు, అధికారులకు మధ్య వాదోపవాదనలు జరిగాయి. అంగన్‌వాడీలకు సెంటర్ లబ్ధిదారులు, సిఐటియు, రైతు సంఘం నాయకులు అండగా నిలిచారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించిన తర్వాతనే కేంద్రాలను తెరవాలని డిమాండ్ చేశారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

- ఆర్‌డిఒ కార్యాలయంకు తరలి వచ్చిన కార్యకర్తలు, ఆయాలు
- కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి
- ప్రభుత్వం స్పందించేంత వరకూ సమ్మె ఆగదు
- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నేతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నంద్యాల జిల్లా కేంద్రంలో అంగన్వాడీలు కదం తొక్కారు. నంద్యాల ఆర్డీఓ కార్యాలయంకు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు భారీ ఎత్తున తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మెను విరమింపజేసేది లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. సోమవారం నంద్యాల ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్వాడీల నిరసన దీక్షలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.నాగరాజు మాట్లాడారు. అంగన్వాడీల సమస్యల పరిష్కరించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఫల్యమయ్యారని విమర్శించారు. తల్లీ బిడ్డ, గర్భిణీలు ఆరోగ్యంగా ఉండాలంటే అంగన్వాడీలు ఎంతో ముఖ్యమని, అలాంటి అంగన్వాడీల పట్ల సిఎం జగన్ మొండిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అంగన్వాడీలను బెదిరించాలని చూస్తే భయపడరని తెలుసుకోవా లన్నారు. అంగన్వాడీలను అణిచి వేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉద్యోగులను, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బందిని, అంగన్వాడీలను బెదిరించి పాలన చేయాలని చూస్తే సిఎం జగన్మోహన్ రెడ్డికి పుట్టగతులుండవని హెచ్చరించారు. అంగన్వాడీలు మిగతా 6వ పేజీలో...

స్పందన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ

- వేగవంతంగా పరిష్కరించాలి : డిఆర్ఒ పుల్లయ్య

వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఓ పుల్లయ్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందన సమస్యల వేగవంత పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారి బి.పుల్లయ్య జిల్లా అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ నలమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వేగవంత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్నకు చెబుదాం - స్పందన ఈకేవైసీపై శాఖల వారీగా వారం వారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రజా ఫిర్యాదులపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయి దృష్టి సారించి నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని వినతులు..

- 'సుగాలిమెట్ట గ్రామంలో నాకు సర్వే నంబర్ 2363/1లో విస్తీర్ణం 1.1/4 సెంట్లు కలిగిన ఇంటి స్థలం ప్లాట్ నెంబర్ 266 ఉంది. అయితే కె.కలాం అనే వ్యక్తి ఆ స్థలాన్ని కబ్జా చేసి బేసిమట్టం వేసుకున్నాడు. నా స్థలాన్ని నాకు ఇప్పించి న్యాయం చేయండి' అని కోరుతూ వాసి పెసరవాయి వెంకట సుబ్బమ్మ అర్జీ అందజేసింది.

- 'సర్వే నెంబర్ 766/2ఎలో 4.45 ఏకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకొనేందుకు అవుకు తహశీల్దార్ డి పట్టాను మంజూరు చేశారు. సంబంధిత భూమిని ఆన్‌లైన్ చేయగలరు' అనిఅవుకు మండలానికి చెందిన పోతుల నాగభూషణం డిఆర్ఒకు దరఖాస్తు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 205 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా రెవెన్యూ అధికారికి అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ డిఆర్ఒ ఆదేశాలు జారీ చేశారు.

స్పందన అర్జీదారులకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అన్నదానం : రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్పందన అర్జీదారుల కోసం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, జిల్లా ఖజానా అధికారి ప్రారంభించారు. అర్జీదారులకు భోజనాలు వడ్డించారు. జెడ్పి సిఇఒ సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ డిఎఫ్ఒ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా

- కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు : కలెక్టర్

లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తున్న జిల్లా కలెక్టర్, జెడ్పి చైర్మన్, ఎమ్మెల్యే కాటసాని తదితరులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేద ప్రజల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పిస్తూ జిల్లాలో కొత్త ఫీచర్లతో కూడిన నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడాన్ని, ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రారంభం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రూపేంద్రనాథ్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ జప్రూళ్ళ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, లబ్ధిదారులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని చేపట్టామన్నారు. ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పేద ప్రజలు ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడకు వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలి అనే సందేహాలన్నింటికి వివరంగా ప్రతి ఇంటిలోనూ వివరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వంటి వ్యాధులకు ఎలాంటి పరిమితులు లేకుండా ఎంత ఖర్చయినా పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. వీటిపై ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1,897 కోట్లు వ్యయం చేసిందన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్న రోగి పూర్తిగా కోలుకునే వరకు ఆరోగ్య ఆసరా కింద నెలకు రూ.5,000 చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పోస్టులు ఖాళీగా ఉండకుండా వైద్య సిబ్బందిని నియమించిందన్నారు. ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను గణనీయంగా పెంచిందన్నారు. వైద్యం ఖర్చు రూ.1000 దాటిన చికిత్సల వైద్య ప్రక్రియలు ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేరుస్తూ, చికిత్సల సంఖ్య 3,257కి పెంచినట్లు తెలిపారు. అనంతరం ముఖ్య అతిధులు లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో కూడిన నూతన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కష్టాలను గుర్తించాలి

- ఎపి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం

కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

దేశంలోనే అతి తక్కువ వేతనంతో పని చేస్తూ, గ్రామస్థాయి నిరుద్యోగులు, ప్రజలకు ఉపాధి కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల బాధలు, కష్టాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే గుర్తించాలని ఎపి ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, అన్నపురెడ్డి దేవదాస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిసెంట్లు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఫీల్డ్ అసిస్టెంట్ల బాధలు వర్ణనాతీతమన్నారు. గ్రామీణ స్థాయిలో కొన్ని సంవత్సరాలుగా నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి బాలన్న, సిఐటియు నాయకులు నాగరాజు, నాగన్న, సంపత్, విజయుడు, నాగలింగేశ్వరరెడ్డి, భగవాన్, ఈశ్వరరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, శిల్పా సహకార చైర్మన్

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా రుణాలు
- ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో గత 13 సంవత్సరాలుగా శిల్పామహిళా సహకార్ బ్యాంక్ ద్వారా అక్కచెల్లెమ్మల అభివృద్ధి కోసం నిరంతరాయంగా రుణాలను అందజేస్తూ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డులో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ద్వారా 147 మంది మహిళలకు 19 లక్షల 19 వేల రూపాయల రుణాలను చెక్‌ల రూపంలో బ్యాంక్ చైర్మన్ నాగిని రవిసింగారెడ్డి అధ్యక్షతన ఎమ్మెల్యే మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర బ్యాంక్‌ల మాదిరిగా అత్యధిక వడ్డీలను వసూలు చేయకుండా నామమాత్రంగా అతితక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తున్నామన్నారు. కొందరు శిల్పాసేవా సమితి కార్యక్రమాలను చూసి ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ క్షేత్రంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థం (పుట్టాలమ్మ) క్షేత్రంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య స్వామి వారి స్కంద షష్టి సందర్భంగా ఆలయాన్ని అలంకరించి గర్భాలయంలో వెలసిన స్వామి వారి పుట్టకు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ వేద పండితులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఆవరణంలో ఉన్న పరశు రామేశ్వర స్వామి, రామతీర్థం కొండపైన ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి వార్లను కూడా భక్తులు దర్శించుకున్నారు. సుబ్రహ్మణ్య షష్టి స్వామి పర్వదినం సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పుట్టాలమ్మ క్షేత్రంలో క్యూలైన్లో వేచి ఉన్న భక్తులు

అధికార లాంఛనాలతో సిఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ అంత్యక్రియలు

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కాటసాని, అధికారులు

ప్రజాశక్తి - బనగానపల్లె

కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామంలో సిఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ జివి.సుధాకర్ రెడ్డి అంత్యక్రియలు సోమవారం అధికార లాంఛనాలతో జరిగాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఈ నెల 17న జరిగిన నక్సల్స్ కాల్పుల్లో సిఆర్‌పిఎఫ్ ఎఎస్సై జివి.సుధాకర్ రెడ్డి మృతి చెందారు. జివి.సుధాకర్ రెడ్డి భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామం కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి తీసుకొచ్చారు. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట రామయ్య, తహశీల్దార్ పుష్ప కుమారి, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అశ్రునయనాలతో నివాళులు అర్పించారు. అనంతరం అధికార లాంచనాలతో ఎఎస్ఐ అంత్యక్రియలు నిర్వహించారు. జివి.సుధాకర్ రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న అధికారులు, ప్రజలు

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రాణాలు కాపాడండి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి రెండువైపులా స్పీడ్ బ్రేకర్లు వేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం రైతు నగరం దగ్గర రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.మహమ్మద్ గౌస్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌తలు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి రెండువైపులా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరిగి ఇప్పటికే చాలామంది టూ వీలర్స్, ఆటో డ్రైవర్లు, ప్రజలు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నంద్యాల జిల్లా ఏర్పాటయిన తర్వాత నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో కలెక్టరేట్ ఉండడంతో ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, బనగానపల్లె, గిద్దలూరుతోపాటు జిల్లా నలుమూలల నుండి వేలాదిమంది బైకర్లు, ఆటోలలో వస్తుంటారని తెలిపారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం తగదన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బి అధికారులు, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యే స్పందించి వెంటనే నూనెపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జికి రెండు వైపులా స్పీడ్ బ్రేకర్లు వేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాప్, శేఖర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

చిరు వ్యాపారులకు అండగా ఉంటాం : చైర్మన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టణంలోని చిరు వ్యాపారులకు అండగా ఉంటామని నంద్యాల మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నీసా పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని చిన్న వ్యాపారుల సంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షులు సత్య నారాయణ అధ్యక్షతన జిల్లా మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా, చిరు వ్యాపారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు ఆకుమల్ల రహీంలు హాజరై చిరు వ్యాపారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు మాట్లాడుతూ చిరు వ్యాపారులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించడానికి, వారి గేట్లను తీసేయాలని, వడ్డీ రహిత రుణాలు మంజూరు చేయాలని చైర్మన్‌ను కోరారు. ఇండ్లు లేనివారికి ప్రభుత్వంచే ఇంటి స్థలాలతో పాటు ఇండ్లు కట్టించి ఇవ్వాలన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల కోరికలు న్యాయమైనవేనని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతన జిల్లా కమిటీ అధ్యక్షులుగా సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మదార్ వలి, జిల్లా కోశాధికారిగా అన్వర్, నంద్యాల పట్టణ అధ్యక్షులుగా మన్సూర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిద్దయ్య, పట్టణ కోశాధికారిగా నారాయణ ఉపాధ్యక్షులు సంజీవ రాజు, వాసు, కలాం, సాయి, కార్యదర్శులుగా చంద్రపాల్, రాముడు, షేక్షావలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు.

చిరు వ్యాపారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులను అందజేస్తున్న చైర్మన్

మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ ఇవ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల

మాట్లాడుతున్న నాయకులు శివ

డిఎస్‌సి కోచింగ్ విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం చాలా మోసం చేసిందని, ఇప్పటికైనా మెగా డిఎస్‌సికి నోటిఫికేషన్ ఇచ్చి ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో అధికారంలోకి వస్తే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ఏటా డిఎస్సీ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాలలో ఎన్ని డిఎస్సీలు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. యువత డిఎస్సీ కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తూ విజయవాడ, హైదారాబాద్ లాంటి ప్రాంతాలలో కోచింగ్ సెంటర్లలో వేలకు వేలు ఫీజులు చెల్లిస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నారని అన్నారు. మరోపక్క ఉద్యోగ అప్లికేషన్‌కు వయసు అయిపోయి మానసిక వ్యధను అనుభవిస్తున్నారని చెప్పారు. పార్లమెంటు సాక్షిగా డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఎపిలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం అడిగిన ప్రశ్నకు 54 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారిక లెక్కలు చెబితే రాష్ట్ర మంత్రులు అవగాహన లేమితో వందలలో ఖాళీలు చూపుతున్నారని అన్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల నోటిఫికేషన్ రాదేమోనన్న అభద్రతాభావంతో బలవన్మరనాలకు పాల్పడుతున్నారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం టెట్ నిర్వహించి మెగా డిఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేనిపక్షంలో నిరుద్యోగ యువతతో కలిసి డివైఎఫ్ఐగా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

ఎఫ్ఆర్ఒల అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎపి ఎఫ్ఆర్ఒ అసోసియేషన్ కర్నూలు సర్కిల్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అడిషనల్ జాయింట్ సెక్రటరీ డిఎస్.సుదర్శన్, రాయలసీమ ప్రాంతీయ కార్యదర్శి ఎస్‌సి. సుబ్బరాయుడులు వ్యవహరించారు. నూతన కమిటీ అధ్యక్షులుగా పి.సుభాష్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.దినేష్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా పి.ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా కెఎం.నయీం అలీ, కోశాధికారిగా జడ్ఎన్.ఝూలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల, ఆత్మకూరు, ప్రొద్దుటూరు, కడప డివిజన్‌ల ఎఫ్ఆర్ఒలు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కమిటీ

డిప్యూటీ తాసిల్దార్ వినతి పత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

పట్టా పాస్‌పుస్తకాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పూర్వం నుండి సాగులో ఉన్న దళితులకు పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు డిప్యూటీ తాసిల్దార్‌కి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు ఎ.బి.యమ్ పాలెం కాలనీవాసులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు మండలం మల్యాల చెరువులో సర్వేనెంబర్ 504/10 తదితర సర్వేనెంబర్‌లో 30 దళిత కుటుం బాలు మూడు తరాల నుండి వరి, మొక్కజొన్న, వేరుశెనగ, సెనగ తదితర పంటలు సాగు చేసుకుని అనుభవిస్తున్నారని వారందరికీ పట్టా, పాస్ పుస్తకాలు ఇచ్చి ఆన్లైన్లో నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాల నాయకులు ఎస్ రామసుబ్బయ్య, కొంగర వెంకటేశ్వర్లు, బాలయ్య ,ప్రసాద్, నాగేంద్ర, ఏబీ ఎమ్ పాలెం కాలనీవాసులు సుంకన్న, రాణి, చిన్న రాజు, రంగస్వామి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

22న దేవస్థాన అంగళ్ళకు బహిరంగ వేలం

ప్రజాశక్తి - గడివేముల

గడివేముల గ్రామంలో శ్రీ మూలపెద్దమ్మ దేవరా దేవస్థానము నందు ఈ నెల 22న టెంకాయలు, పులు పూలదండలు విక్రయ అంగళ్ళకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలము నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి మోహన్, ఆలయ చైర్మన్ చిన్నన్న తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఒక సంవత్సర కాలంలో అమ్ముకునే హక్కును కల్పించడం కొరకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామన్నారు. పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాలొన్నాలన్నారు.

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు : ఎంఇఒ

ప్రజాశక్తి - పగిడ్యాల

చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంఇఒ సుభాన్ అన్నారు. సోమవారం పగిడ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి చదువుతున్న విద్యార్థి పి చిన్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు అధ్యక్షతన జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని చిన్నని సన్మానిం చారు. ఈ సందర్భంగా ఎంఈఓ సుభాన్, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రావు మాట్లాడారు. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇక్కడే చదువుతూ పదవ తరగతి చదువుతూ పి చిన్న క్రీడల్లో ప్రతిభ కనబరుతున్నాడన్నారు. జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పి చిన్నాను మెమోంటొతో సన్మా నించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రషీద్ మియ్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, క్రీడా శ్రీ తోకల పితాంబ రెడ్డి, శివ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సిఎం జగన్ చొరవతో డీ-పట్టా నుండి ఫుల్ పట్టాగా

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి
- ఇనాం భూములకు సంపూర్ణ భూ హక్కు పత్రాల పంపిణీ

భూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న మంత్రి బుగ్గన

ప్రజాశక్తి - బేతంచెర్ల

సిఎం జగన్ చొరవతో డీ-పట్టా నుంచి ఫుల్ పట్టాగా మార్పు చేసి సామాన్య రైతులకు ప్రభుత్వం పంపిణీ చేస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అధ్యక్షతన, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ గుమ్మగాళ్ల రాజుల ఆధ్వర్యంలో 129 మందికి 200 ఎకరాల ఇనాం భూములకు సంపూర్ణ భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఉన్న భూములకు హక్కు కల్పించామన్నారు. రుణాలు, అమ్మకాలకు అవకాశం లేని భూములపై సర్వ హక్కులు ఇచ్చామని, 310 మందికి 500 ఎకరాలు పంపిణీ సగటున ఒక్కొక్కరికీ 2 ఎకరాల చొప్పున భూమి పత్రాల పంపిణీ చేస్తున్నామన్నారు. బేతంచెర్లలో ఎకరాకు సగటున రూ.15 లక్షలు అనుకున్నా రూ.30 లక్షల ఆస్తిని దక్కేలా చేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చొరవతో డీ-పట్టా నుంచి ఫుల్ పట్టాగా మార్చగలిగామన్నారు. నిత్య అవసరాల ధరలపై టిడిపి నేతలు ఇంటింటికి వచ్చి ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. జనవరి నుంచి రూ.3వేలుగా పెన్షన్ పెంపు చేస్తున్నామన్నారు. టిడిపి అబద్ధపు హామీలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. 50 కి.మీ. దూరంలోని గోరుకల్లు నుంచి బేతంచెర్ల వరకూ పైప్ లైన్ వేసి నీరివ్వడానికి కృషి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల ఎంపీపీ నాగభూషణం రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ చలం రెడ్డి, మండల వైసీపీ నాయకులు బాబుల్ రెడ్డి, శ్రీ మద్దిలేటి స్వామి ఆలయ ఛైర్మన్ రామచంద్రుడు, ఆలయ ఇఒ పాండురంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి ఆలయ నిర్మాణ పనుల పరిశీలన

రూ.50 కోట్లతో జరుగుతున్న శ్రీ మద్దిలేటి స్వామి ఆలయ అభివృద్ధి పనులను, రూ.6 కోట్లతో ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న టూరిజం హోటల్ స్థలంను మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి పరిశీలించి పలు సూచనలు చేశారు. శ్రీ మద్దిలేటి స్వామి ఆలయ సందర్శనకు వచ్చిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌కు ఆలయ మర్యాదలతో వేద పండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆర్థిక మంత్రి బుగ్గన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి మద్దిలేటి స్వామి మాజీ ఛైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి, ఎంపీడీవో వెంకన్న, మద్దిలేటి స్వామి ఛైర్మన్ సీతారామ చంద్రుడు, వైస్ ఎంపీపీ రంగస్వామి, కోడె వెంకటేశ్వర్లు, ఏపీఎం రంగనాయకులు, ఏపీవో శేషన్న, కౌన్సిలర్ నాగిరెడ్డి, ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ కాజా హుస్సేన్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళి కృష్ణ, బాబుల్ రెడ్డి, మధు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు జడ్జి హిమా కోహ్లీకి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేద పండితులు

మల్లన్న సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

ప్రజాశక్తి - శ్రీశైలం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి హిమా కోహ్లీ కుటుంబ సమేతంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని సోమవారం నాడు దర్శించుకున్నారు. శ్రీకృష్ణ దేవరాయ గోపురం వద్దకు చేరుకొన్న వారికి ఆలయ కార్యనిర్వహణా ధికారి పెద్దిరాజు, ఏఈఒలు, ఉబయ దేవాలయాల ప్రధాన అర్చకులు, వేదపండితులు, సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం ముందుగా స్వామివారిని ఆ తరువాత అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేద పండితులు వేద ఆశీర్వచనములు పలకగా శేష వస్త్రాలను ప్రసాదాలను జ్ఞాపికను ఏఇఒ మోహన్ అందజేశారు.

శ్రీశైలంలో తగ్గని భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

దర్శనం కోసం క్యూలో నిల్చున భక్తులు

శ్రీశైల క్షేత్రంలో భక్తులరద్దీ తగ్గకుండా కొనసాగుతుంది. వీధులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. గత మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగినప్పటికీ చలిని లెక్కచేయకుండా తెల్లవారుజామున మూడు గంటల నుండి పాతాళ గంగలో స్నానాల ఆచరించి స్వామి అమ్మవారిని దర్శించుకుం టున్నారు. భక్తులు శీఘ్ర ,అతి శీఘ్ర, ఉచిత క్యూలైన్లలో వేచి ఉండి స్వామి వారిని అలంకారంలో దర్శించుకుంటున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు నాలుగు గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయ అధికారులు తెల్లవారుజామున మూడు గంటలకి ఆలయ ద్వారాలు తెరిచి మహా మంగళహారతి అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. దర్శనానికి క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తు లకు ఉచితంగా మంచినీరు అల్పాహారం బిస్కెట్లు అందజేస్తున్నారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ద్వారా కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షిస్తున్నారు. డిఎస్పి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు నిరంతరం క్షేత్ర పరిధిలో పర్యవేక్షిస్తున్నారు. లోక కళ్యాణం కోసం దేవస్థానం నిర్వహించే పూజలలో భాగంగా సోమవారం నాడు కుమార స్వామికి సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు. అదేవిధంగా భక్తులను అలరించేందుకు దేవస్థానం ఏర్పాటుచేసిన కళారాధన కార్యక్రమంలో భాగంగా దక్షిణ మాడ వీధిలో సంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

మెగా ఆరోగ్యశ్రీ బ్రోచర్ ఆవిష్కరణ

ఆళ్లగడ్డ : ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నియోజకవర్గంలోని సిరివెళ్ల మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ ముఖేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామ్మోహన్ రెడ్డి, ఈఓపిఆర్డి నాగేంద్రుడు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంలు మెగా ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను సోమవారం విడుదల చేశారు. అంతకుముందు తాడేపల్లి నుండి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మెగా ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారు వీక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ భవనాసి ముకేశ్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఏదైనా ఆరోగ్య సమస్య ఎదురైనా, ప్రమాదానికి గురైనా వైయస్సార్ ఆరోగ్య శ్రీ పథకము ద్వారా చికిత్స పొందడానికి 104 కాల్ సెంటర్‌కు, విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా సహాయం తీసుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యశ్రీ ఆసుపత్రికి వెళ్ళేటప్పుడు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, కుటుంబంలో ఎవరో ఒకరిది బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు రూ. 5 లక్షల నుండి 25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్వైజర్లు రవికిషోర్, అమినాబి తదితరులు పాల్గొన్నారు. **బనగానపల్లె :** డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం రూ. 5 లక్షల నుండి రూ. 25 లక్షల వరకు పెంచుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రారంభించారని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివ శంకరుడు తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో తాడేపల్లి నుండి డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యులు, సిబ్బంది వీక్షించారు. కార్యక్రమంలో బనగానపల్లె ఏరియా హాస్పిటల్ డాక్టర్ లలిత, ఎంపిహెచ్ఇఒ ఎన్.వెంకటేశ్వర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బ్రోచర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పాములపాడు : రాష్ట్ర ప్రభుత్వం వైయస్సార్ ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుండి రూ.25 లక్షల వరకు పెంచిన ఆరోగ్యశ్రీ కార్డు బ్రోచర్లను నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ సోమవారం ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సీఎం క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉచితంగా ఆరోగ్యశ్రీ 25 లక్షల వరకు పంపిణీ చేసిన కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంపీపీ సరోజినీ వర్ధినియ, ఎంపీడీవో గోపికృష్ణ, తహశీల్దార్ రత్న రాధికలతో కలిసి వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధి రూ.25 లక్షల వరకు పెంచడం పేదలకు వరం అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచులు కోట్ల చంద్రారెడ్డి, రామస్వామి, మౌలాలి, మద్దూర్ ఎంపిటిసి బషీర్ అహ్మద్, మండల వైసీపీ నాయకులు రమణారెడ్డి, బాలీశ్వర్ రెడ్డి, జూటూరు మధు, ఉపేంద్ర, రాము లమ్మ, భీమ శేఖర్, రాజన్న, స్వామి దాసు, ఓబుల్ రెడ్డి డాక్టర్ నాగలక్ష్మి దేవి, ఎపిఎం అనురాధ, ఏపీవో విమలమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరిస్తున్న మెగా ఆరోగ్యశ్రీ వర్చువల్ కార్యక్రమాన్ని నందికొట్కూరు తాసిల్దార్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ షైనీ ప్రియాంక, ఎంపీడీవో శోభా రాణి, మున్సిపల్ కమిషనర్ పి కిషోర్, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ సోమేశ్వరి మెగా ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25లక్షలకు అప్‌గ్రేడ్ చేస్తున్న కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో డోన్ మున్సిపల్ కార్యాలయం నుంచి వీక్షిస్తున్న చైర్మన్ సప్తశైల రాజేష్, అధికారులు, తదితరులు

ఆరోగ్యశ్రీ బ్రోచర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

పేదల సంక్షేమమే వైసిపి లక్ష్యం : ఎమ్మెల్యే

సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

పేద ప్రజల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 5వ సచివాలయ పరిధిలోని రాంభూపాల్ నగర్, ఎస్టి కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కాలనీలలో సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల కోసం పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని సిఎంగా, తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, ఎంఈఓ స్వరూప, పిఆర్ఏఈ మహేష్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, జడ్పిటిసి సుబ్బలక్ష్మమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ దీవెనమ్మ, పట్టణ సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, గ్రామపంచాయతీ ఈవో ఖలీల్, భానుముక్కల పరపతి సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు, ఎంపీటీసీ వెంకట సుబ్బయ్య, వైసీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు అంబటి రవికుమార్ రెడ్డి, నాయకులు జిటి వెంకటరామిరెడ్డి, కిషోర్ కుమార్, ఈసారి ఎల్లయ్య, కోనేటి శ్రీనివాసులు, పోలూరు కృష్ణ, తెలుగు నాగేంద్ర, తెలుగు మద్దయ్య, గౌండ కంబగిరి, బాలు, నారాయణ, సచివాలయ ఉద్యోగులు, వాలంటరీలు, కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

నంద్యాలలో తెలుగు డ్రామా కంపెనీ : ఎమ్మెల్యే శిల్పా

నంద్యాల కలెక్టరేట్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ నంద్యాలలో తెలుగు డ్రామా కంపెనీ మొదలైందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి టిడిపి నాయకులనుద్దేశించి అన్నారు. సోమవారం నంద్యాల పట్టణంలోని 32వ వార్డు బొమ్మల సత్రంలో వార్డు ఇంచార్జ్ కాశిం, వైసీపీ జిల్లా జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాల పంపిణీ చేసి ప్రభుత్వ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా, కులమత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అన్నారు. వచ్చే ఎన్నికలలో కూడా మరోసారి తమను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శశికళ రెడ్డి, రాష్ట్ర దృశ్యకళాల డైరెక్టర్ సునీత అమృతరాజ్, నంద్యాల 3వ పట్టణ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, వార్డు నాయకులు మాధవరెడ్డి, డి.దస్తగిరి, అశోక్ రెడ్డి, జమాల్ బాషా, అనంతలక్ష్మి, ఖాద్రి, షరీఫ్, నాగరాజు, సన్నీ, రమణ, శివాజీ రావు, రమణారెడ్డి విజయ్ కుమార్ వైసీపీ నాయకులు అమత రాజ్, గన్ని కరీం, వైసిపి యూత్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : సప్తశైల రాజేష్

ప్రజాశక్తి-డోన్

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైలరాజేష్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో రాష్ట్రం ముందంజలో ఉందని మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. డోన్ పట్టణంలోని 16వ సచివాలయం పరిధిలోని 29,30,31వార్డులలో ఇంద్రనగర్ పరిధిలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల విద్య, వైద్యం, సంక్షేమం గురించి ఆలోచించే వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి అవసరమని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జాకీర్ , పట్టణ జెసిఎస్ కన్వీనర్ కురుకుంద హరి,కౌన్సిలర్లు ఆర్ట్ రమణ ,మేకల విమల, మీనాక్షి, సచివాలయ కన్వీనర్ రంగస్వామి, ఎల్ ఈశ్వర్, గహ సారథులు, వైసిపి నాయకులు పాలొట్ల రఘురామ్, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కదం తొక్కిన అంగన్వాడీలు

అంగన్వాడీలకు సంఘీభావం ప్రకటిస్తున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డి

5వ పేజీ తరువాయి.. లక్షమందే అనుకుంటున్నా వారి కుటుంబాలలో దాదాపు పది లక్షల మంది ఓటర్లు ఉన్నారని సిఎంకు గుర్తు చేశారు. ఉద్యోగులకు, అంగన్వాడీలకు మధ్య చిచ్చు పెట్టాలని ప్రభుత్వం చూస్తుందని, ఆ ఆటలు సాగనివమన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, జిల్లా ఉపాధ్యక్షురాలు డి.నిర్మల మాట్లాడుతూ 'న్యాయమైన కోర్కెలు పరిష్కరించమంటే స్పందించరా..? అంగన్వాడీలను రోడ్లపైకి ఈడుస్తారా..? పిల్లలను ఎంతో భద్రంగా చూసుకుంటూ వారికి కావాల్సిన ఆహారం అందిస్తున్న అంగన్వాడీలపై ఎందుకు ఇంత వివక్ష చూపుతున్నారు..' అని అన్నారు. సిఎం జగన్ పెంచింది వేయి రూపాయలు మాత్రమేనని, గత ప్రభుత్వం రూ.10 వేలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సిఎం స్పందించకుంటే సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.మద్దులు, జిల్లా నాయకులు వి.బాలవెంకట్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.లక్ష్మణ్, మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని పేరుకు మాత్రమే చర్చలు జరిపారు తప్ప, ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే మరోవైపు సచివాలయ ఉద్యోగులను, పోలీసులను పెట్టి కేంద్రాలను తెరిపించడం, తాళాలు పగలగొట్టడం దుర్మార్గమన్నారు. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాళ్లు వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, సునీత, నాగరాణి, నాగమణి, పద్మ, సుజాత, ఉదయలక్ష్మి, మనోజ, సరస్వతి, డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ఆత్మకూరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, జిల్లా సహాయ కార్యదర్శిలు రామ్ నాయక్, భాస్కర్ రెడ్డి, అధ్యక్షులు రజాక్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాజెక్ట్ నాయకురాలు హరిత, మంజుల, మదర్ బి, శివలక్ష్మిలు అన్నారు. పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పగిడాల మండలాల అంగన్వాడీలు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. యూనియన్ నాయకురాలు సాజిదా బేగం, రాము లమ్మ, పద్మావతి, సుబ్బమ్మ, ప్రజా సంఘాల నాయకులు శివుడు, గోపాలకృష్ణ, ఫకీర్ సాహెబ్, నాగన్న, కర్ణ, స్వాములు, రామదాసు, రణధీర్, సురేంద్ర, మా బాష, సుధాకర్, నరసింహ నాయక్, సామన్న తదితరులు పాల్గొన్నారు. **మాజీ ఎమ్మెల్యే బుడ్డా మద్దతు..** అంగన్వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మద్దతు తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కరిస్తామని తెలిపారు. **జనసేన పార్టీ మద్దతు..** అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని శ్రీశైలం నియోజకవర్గం జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీరాములు మద్దతు తెలియజేశారు. **చాగలమర్రి :** స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన దీక్షలు చేపట్టారు. సచివాలయ సిబ్బంది అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టిస్వాధీన పరచు కోవడంతో ర్యాలీగా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ దీక్షలకు టిడిపి వివిధ ప్రజాసంఘాలు సంఘీభావం తెలిపే మద్దతు తెలిపాయి. దీక్షలను బీసీ సంఘం నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్ రామతీర్థం, దూదేకుల సంఘం నాయకులు టైలర్ బాష, సిఐటియు నాయ కులు ఉట్టి నరసింహులు సందర్శించి అంగన్వాడీలకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

'గురు రాజా'కు స్టేట్ బెస్ట్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - నంద్యాల

పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

హైదరాబాద్‌లోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో బ్రెయిన్ ఫీడ్ సంస్థ వారు ఇటి టెక్ ఎక్స్ అవార్డు స్టేట్‌లోని టాప్ 5 స్కూల్స్‌లో శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు బెస్ట్ స్కూల్ ఎక్సలెంట్ అవార్డును డైరెక్టర్ పి. షేక్షావలి రెడ్డి అందుకున్నారు. అకాడమిక్ కరికులంలో భాగంగా టెక్నికల్ లర్నింగ్, మోస్ట్ ఇన్నోవేటివ్ మెథడ్స్, ఆల్రౌండ్ డెవలప్మెంట్ వంటి అంశాలలో ఆధునిక నూతన తత్వాన్ని ఉపయోగిస్తూ బోధన చేస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయ బృందానికి ఏర్పాటు చేసిన అభినందన సభలో అయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్స్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు వెలుగు ఐకెపి కార్యాలయం నందు ఏపీఎం అనురాధ ఆధ్వర్యంలో పొదుపు మహిళల సమక్షంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఆర్థర్ హాజరై కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరోజినీ వర్ధినయ, ఎంపీడీవో గోపికృష్ణ తాసిల్దార్ రత్న రాధిక, మండల మహిళా సమైక్య గ్రూపు సభ్యులు విలేజి బుక్ కీపర్స్ పాల్గొన్నారు.

కిస్మస్ కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

ఉద్యోగులకు, అంగన్‌వాడీలకు మధ్య ప్రభుత్వం చిచ్చు

చాగలమర్రి : అంగన్వాడీ సెంటర్ తాళాలను పగలగొడుతున్న అధికారులు

5వ పేజీ తరువాయి.. అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తలారులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీల మధ్య తోపులాట జరిగింది. అంగన్‌వాడీలకు మద్దతుగా సెంటర్ లబ్ధిదారులు, సిఐటియు నాయకులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, ప్రజలు తరలివచ్చి తాళాలు పగలగొట్టకుండా అడ్డుకున్నారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ గత వారం రోజులుగా జీతాలు పెంచాలని సమ్మె చేస్తున్న తమను పట్టించుకోని ముఖ్యమంత్రి దౌర్జన్యంగా తాళాలు పగలగొట్టించి సెంటర్లు తెరిచే చర్యలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టడం తగదన్నారు. వేతనాలు పెంచేంతవరకూ సెంటర్లను తెరవనివ్వబోమని హెచ్చరించారు. నాయకులు రామచంద్రుడు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అనుమతి మేరకే తాళాలు పగలగొట్టడానికి వచ్చామని చెబుతున్న అధికార యంత్రాంగం, తోటి ఉద్యోగులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చాలీచాలని జీతాలతో బతుకులీడుస్తూ గత్యంతరం లేక సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీలకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఆలోచించాలన్నారు. దౌర్జన్యంగా సమ్మె విచ్ఛిన్నం కోసం తాళాలు పగలగొట్టేందుకు పూనుకుంటే అంగన్వాడీలకు మద్దతుగా రైతులు, కూలీలు, కార్మికులు తరలివచ్చి మరింత తీవ్రస్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్తారని అన్నారు. మొండిగా పట్టుదలకు పోకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో వారితో చర్చించి డిమాండ్స్‌ను తీర్చాలని కోరారు. **కొలిమిగుండ్ల :** కొలిమిగుండ్ల మండలంలోని అంగన్వాడి సెంటర్ల తాళాలను పగలగొట్టి సెంటర్లను తహశీల్దార్ ధోని ఆల్ ఫ్రెండ్, ఎంపీడీవో సాయికృష్ణ, ఎస్ఐ రమేష్ రెడ్డి, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బందికి అప్పగించారు. సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నా చిన్నారులు ఎవరూ రాకపోవడంతో సిబ్బంది సెంటర్లలో ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. **బనగానపల్లె :** మండలంలోని వివిధ గ్రామాలలో సచివాలయ ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాల తాళాలను పగలగొట్టి స్వాధీనం చేసుకున్నారు. కేంద్రాల తాళాలు పగలగొట్టడంతో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా సచివాలయ ఉద్యోగులతో బలవంతంగా కేంద్రాల తాళాలను పగలగొట్టడం సమంజసం కాదని సిఐటియు డివిజన్ కార్యదర్శి జెవి సుబ్బయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రి పట్టణ మేజర్ గ్రామపంచాయతీ ఇన్చార్జి ఈవో నాగమణి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు అంగన్వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి తాళాలను పగలగొట్టి స్వాధీనం చేసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలకు చిన్నారులు ఎవ్వరూ రాకపోవడంతో సిబ్బంది సెంటర్లలో ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది.